క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 39, వంకాయ 28, బెండ 28, పచ్చిమిర్చి 45, కాకర 40, బీర 23, క్యాబేజీ 20, ఫ్రెంచిబీన్స్ 35–65, క్యారెట్ 43, దొండ 28, చిక్కుడు 28–50, గోకర 28, బీట్‌రూట్ 26, క్యాప్సికం 57, ఆలు 21, దోస 25, సొర 13, పొట్ల 18, ఉల్లిగడ్డ 30, చామగడ్డ 38. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు 'డయల్ యువర్ ఆర్‌ఎం'

చైతన్యపురి: టీఎస్ ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ పరిధిలోని ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ నుంచి బయలుదేరే జిల్లా సర్వీసులకు సంబంధించిన సమస్యలు తెలుసుకొనేందుకు, సూచనలు, సలహాలు స్వీకరించేందుకు శుక్రవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్–2 డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. సిటీ బస్‌లు కాకుండా జిల్లా, దూర ప్రాంత సర్వీసుల గురించి, హైదరాబాద్–1, హైదరాబాద్–2, పికెట్, మియాపూర్–1, బీహెచ్‌ఈఎల్, పరిగి, తాండూరు, వికారాబాద్ డిపోల బస్సుల గురించిన సమస్యలు, సలహాలను ప్రయాణికులు నం. 9959226241 కు ఫోన్ చేసి తెలియజేయాలని డీఎం తెలిపారు.

ప్రత్యంగిరాదేవికి సినీనటి ఇంద్రజ ప్రత్యేక పూజలు



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ కుర్తాళం పీఠంలోని వారాహి సమేత ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయంలోని అమ్మవారిని సినీనటి ఇంద్రజ గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులు ఇంద్రజకు ప్రత్యంగిరా అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో అరుణ, హేమ, విఠల్ శర్మ, సాయి కుమార్ శర్మ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉద్యానవనంలో వసతులు కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న జీహెచ్‌ఎంసీ అధికారులు

చాదర్‌ఘాట్: నల్గొండ చౌరస్తాలోని జాతీయ దివ్యాంగుల ఉద్యానవనంలో వసతులు కల్పించాలని పలువురు దివ్యాంగ సంఘాల నాయకులు కోరారు. గురువారం ఉద్యానవనంలో జీహెచ్‌ఎంసీ అధికారులు సంఘం నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యానవనంలో దివ్యాంగులు నిర్వహించుకునే సమావేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని వారు కోరారు. అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి పూర్తి స్థాయిలో దివ్యాంగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు స్పందించిన అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకన్న, డీసీ జయంత్, యూసీడీ వెంకట్‌రెడ్డి, రుబీనా అయేషా, గంగారామ్, చెరుకు నాగభూషణం, గోపాల్‌రావు, ప్రభంజన్‌రావు పాల్గొన్నారు.

బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు



నిందితుడు మహమ్మద్ గౌస్

రంగారెడ్డి కోర్టులు: చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన కేసులో నిందితుడికి మూడేళ్ల శిక్షతోపాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఎల్బీనగర్‌లోని 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి హరీశ్ తీర్పు వెలువరించారు. ఏపీపీ సునీత బర్ల కథనం ప్రకారం.. నిందితుడు మహమ్మద్ గౌస్ నీలి చిత్రాలను ఎక్కువగా చూసేవాడు. తన సెల్‌ఫోన్‌లో పొందుపర్చుకున్న నీలిచిత్రాలను తాను పనికి వెళ్లే దారిలో ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికలకు చూపించి వారితో అసభ్యంగా ప్రవర్తించేవాడు. తరచూ ఇలా చేసే నిందితుడ్ని ఓ రోజు బాలిక తండ్రి గమనించి పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చైతన్యపురి పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేశారు. రిమాండ్‌కు తరలించి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను విచారించిన కోర్టు నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించింది.

రోడ్లు తవ్వి వదిలేశారు!



ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో గుంతలు పడ్డ రోడ్డు

- ముంపు సమస్య పరిష్కారానికి రోడ్లు తవ్వి పైప్‌లైన్ల ఏర్పాటు
- ఆపై రోడ్లకు మరమ్మతు చేపట్టని అధికారులు
- అధ్వానంగా మారిన రోడ్లపై రాకపోకలకు అవస్థలు

నాగోలు: పై కాలనీల నుంచి వచ్చే వరద నీటితో కింది కాలనీవాసులు అనేక సంవత్సరాలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.. ముంపు సమస్య పరిష్కారం కోసం కాలనీలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు...కానీ పైప్‌లైన్ కోసం తవ్విన రోడ్డును మాత్రం తిరిగి వేయాలేదు. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే పరిస్థితి లేక కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని కొత్తపేట డివిజన్ శ్రీరామలింగేశ్వర కాలనీ (ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ), బృందావన్ కాలనీ, సత్యానగర్‌ల్లో వరద నీరు, డ్రైనేజీ నీటి దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్య పరిష్కారం కోసం పైకాలనీ నుంచి వరద నీరు ఈ మూడు కాలనీల్లోకి రాకుండా కొత్త పైప్‌లైన్ వేశారు.
- రోడ్లు తవ్వి పైప్‌లైన్ వేసిన అధికారులు.. తవ్విన రోడ్లకు మరమ్మతు చేయడం లేదా కొత్తది వేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేయలేదు.
- రోడ్డు నిర్మాణం కోసం స్థానిక ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేసినప్పటికీ నిర్మాణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.
- శ్రీరామలింగేశ్వర కాలనీ రోడ్డు మిగతా కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్డు. అయితే ఇక్కడ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. గుంతలు పడి అధ్వానంగా తయారైన ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. .
- బృందావన్ కాలనీ, సత్యానగర్‌ల్లోను తవ్విన రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి.
- రోడ్ల విషయమై జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయా కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్రీరామలింగేశ్వ కాలనీతో పాటు బృందావన్ కాలనీ, సత్యానగర్ కాలనీల్లో రోడ్లకు మరమ్మతు చేపట్టాలని, లేదా.. కొత్తగా సీసీ రోడ్డు నిర్మించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలి అధ్వానంగా ఉన్న ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ రోడ్డు



ఇదీ సత్యానగర్ రోడ్డు దుస్థితి

ఒకే అభివృద్ధి పనికి పోటాపోటీగా శంకుస్థాపనలు

హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్‌లో భగ్గుమన్న విభేదాలు



నందనవనం శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్



శంకుస్థాపన చేస్తున్న పద్మానాయక్ భర్త, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సత్యంచారి

హస్తినాపురం: డివిజన్‌కు మంజూరైన అభివృద్ధి పనులను కార్పొరేటర్ సుజాతానాయక్ ఒక వర్గంగా, డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సత్యంచారి, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్ భర్త శ్రీనివాస్‌నాయక్ మరో వర్గంగా పోటా పోటీగా ప్రారంభించారు. దీంతో హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. వివరాలు.. నందనవనం బస్తీ శ్మశాన వాటిక నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో కార్పొరేటర్ సుజాతానాయక్ గురువారం అధికారులతో కలిసి పనులకు శంకుస్థాపన చేయగా, ఇవే పనులను డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సత్యంచారి, శ్రీనివాస్‌నాయక్‌లు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. దీంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, అధికారులు, కాలనీవాసులు నివ్వెరపోయారు. కొంతకాలంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్న అధికారిక కార్యక్రమాలలో స్థానిక కార్పొరేటర్ సుజాతా నాయక్ పాల్గొనక పోవడంతో కార్పొరేటర్- ఎమ్మెల్యే మధ్య దూరం పెరిగింది. దీనికి తోడు మాజీ కార్పొరేటర్ భర్త శ్రీనివాస్‌నాయక్, కార్పొరేటర్ సుజాతానాయక్‌ల మధ్య ఏర్పడిన వర్గ పోరుతో డివిజన్‌లో బీఆర్‌ఎస్ పార్టీకి తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో జరిగే శాసన సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనైనా నాయకులందరినీ ఒక్క తాటిపైకి తీసుకొచ్చి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ కార్యకర్తలు పేర్కొంటున్నారు.

వైద్యురాలిని బెదిరించిన మీడియా ప్రతినిధులపై కేసు

చైతన్యపురి: వైద్యురాలిని బెదిరించి ఇబ్బందులకు గురి చేస్తున్న ఓ చానల్ ప్రతినిధులపై సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... కర్మన్‌ఘాట్‌లోని జీవన్ ఆసుపత్రికి 95 న్యూస్ ప్రతినిధి రాజు, మరికొందరితో కలిసివచ్చాడు. వైద్యురాలు శిరీష దగ్గరకు వెళ్లి 'మీరు డబ్బులు తీసుకుని అక్రమంగా అబార్షన్లు చేస్తున్నారు. మా దగ్గర ఆధారాలు ఉన్నాయి' అని బెదిరించారు. దీంతో డాక్టర్ శిరీష గురువారం సాయంత్రం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి చర్యలు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి కోసం అన్ని విధాల చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీలోని శ్మశాన వాటికలో రూ.93.93 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధికి పనులను శనివారం ఆమె అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజాతానాయక్ మాట్లాడుతూ, నందనవనం శ్మశాన వాటికలో మౌలిక వసతులు లేక ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ను కాలనీవాసులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీఈ కనకయ్య, ఏఈ హేమూనాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బిక్కూనాయక్, శ్మశాన వాటిక అధ్యక్షుడు దయ్యాల వెంకటేశ్, బీఆర్‌ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజుగౌడ్, శ్రీశైలం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..



మున్నాను సత్కరించిన ఆలయ కమిటీ చైర్మన్

సైదాబాద్: నిత్యజీవనంలో తమ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ నక్కల పిట్టలోళ్ల సంఘం చైర్మన్ మున్నా అన్నారు. గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ పెద్దతోటలోని వాగ్మామి దుర్గామాత అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్ర కుల సంఘం సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్నా మాట్లాడుతూ, త్వరలో రాష్ట్రం అంతటా పర్యటించి కులస్తులను చైతన్యవంతం చేస్తామన్నారు. అందరితో చర్చించి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటామన్నారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ చైర్మన్ కె.అశోక్ శాలువాతో సత్కరించారు. కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.విజయ్‌కుమార్, ఆలయ కమిటీ ప్రతినిధి దయా కాళి పాల్గొన్నారు.

నాసిరకం రోడ్డు పనులపై ఫిర్యాదు



వినాయక్‌నగర్‌లో నాసిరకంగా నిర్మించిన సీసీ రోడ్డు

మన్సూరాబాద్: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని, దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి వినాయక్‌నగర్ కాలనీలో రోడ్డు నం.16,17,18 లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ లేకుండా రాత్రి సమయంలో కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేపట్టాడు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా పనులు చేపట్టాడని కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు పెట్టుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు విద్యతో పాటు తమ బాధ్యతలు తెలుసుకొని మంచి ప్రవర్తనతో నడుచుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని నారాయణ పాఠశాల డీన్, జోన్ ఏజీఎం హేమాంబర్ అన్నారు. గురువారం ఆర్‌కేపురం నారాయణ పాఠశాలలో కేబినెట్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని వాటిని చేరుకునేంత వరకు కృషి, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రవిప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ నీరజ, ఏఒ రమేష్, అకడమిక్ డీన్ మహేష్, వైస్ ప్రిన్సిపాల్స్ స్వర్ణ, శ్రావణి పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు అధిక నిధులు కేటాయించాలి: ఎస్‌ఎఫ్‌ఐ

మలక్‌పేట: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు అధిక నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్‌సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లోని సమస్యలు తెలుసుకునేందుకు చేపట్టిన విద్యార్థి మహాపాదయాత్రను గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు ఇంకా ఇవ్వలేని స్థితిలో తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు. బంగారు తెలంగాణ కాదు విజ్ఞాన తెలంగాణ కావాలని, కోఠి ఉమెన్స్ యూనివర్సిటీకి రూ. 100 కోట్ల నిధులు కేటాయించాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పాదయాత్రకు డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎండీ జావెద్ సంఘీభావం తెలిపారు. జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, పాదయాత్ర ఇన్‌చార్జి, జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి, నాయకులు పవిత్ర, నాగేందర్, స్టాలిన్, సునీల్, ప్రశాంత్ పాల్గొన్నారు.



మహాపాదయాత్రను ప్రారంభిస్తున్న నాగరాజు



కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వద్ద రోడ్డుపై నిలిచిన మురుగు

మురుగులోనే పాఠశాలకు వెళ్లాలి!

- మన్సూరాబాద్ ఆటోనగర్ రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

మన్సూరాబాద్: డివిజన్‌లోని పలు కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. సమస్యను పరిష్కరించాలని జలమండలి, సీవరేజ్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. మన్సూరాబాద్ ఆటోనగర్ రోడ్డు కేబీఆర్ కన్వెన్షన్ ఎదుట కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వద్ద గత కొన్ని రోజులుగా డ్రైనేజీ మురుగు రోడ్లపై పారుతుండటంతో విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు డ్రైనేజీ మురుగులోంచి పాఠశాలకు వెళ్లి వస్తుండటంతో వ్యాధుల బారిన పడుతున్నారు. ఇదే రోడ్డులో సహారా వెనుకవైపు కూడా ఇదే పరిస్థితి ఉంది. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి డ్రైనేజీ మురుగు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పేదలను మరోసారి మోసం చేసేందుకు కుట్ర: బీజేపీ



తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించిన బీజేపీ నాయకులు, బాధితులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

హయత్‌నగర్: సంక్షేమ పథకాలను ఆశ చూపించి మరోసారి పేదలను మోసం చేయాలని అధికార బీఆర్‌ఎస్ పార్టీ కుట్ర చేస్తోందని, ఎన్నికలు సమీపిస్తుండటంతో కొత్త పథకాలతో మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తోందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి ఇవ్వకుండా పార్టీ కార్యకర్తలకు, నాయకుల అనుచరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అందని బాధితులతోకలిసి గురువారం బీజేపీ నాయకులు హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. తాను బతికి ఉన్నా చనిపోయినట్లు చూపించి తన పింఛన్‌ను రద్దు చేశారని ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఏళ్ల తరబడి ఇళ్లు లేక రోడ్లపై బతుకుతున్నామని, డబుల్ బెడ్‌రూమ్‌ల కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా తమ పేరు లబ్ధిదారుల జాబితాలో లేదని పలువురు మహిళలు వాపోయారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకుందామంటే దరఖాస్తు తీసుకొనే అధికారే లేని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యాలయం ముందు బైఠాయించారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడం కార్యాలయంలోకి దూసుకెళ్లి ఆయన ఆయన చాంబర్ వద్ద బైఠాయించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసుల జోక్యంతో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆందోళనకారులు బయటకు వచ్చారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, వగా మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, ఎల్లప్ప, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి



రాజుకు ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ధి చే కూరుతోందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ మధురాపురి కాలనీకి చెందిన రాజు కొంత కాలంగా నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకొనే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఎమ్మెల్యేను సంప్రదించాడు. ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించగా, రూ. 2.5 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ చెక్‌ను లబ్ధిదారుడు రాజుకు గురువారం ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు గండి సన్నీయాదవ్, కిరణ్, ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా!



పాడైన పబ్లిక్ టాయిలెట్లను చూపిస్తున్న సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నగరంలో వివిధ ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే మాదన్నపేట పాత పోలీసు స్టేషన్ వద్ద కూడా జీహెచ్‌ఎంసీ శాఖ రెండు పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేసింది. ప్రారంభానికి ముందే అవి పాడయ్యాయి. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించేలా నగరాన్ని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో మంత్రి కేటీఆర్ ప్రధాన దారుల్లో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీకి ఆదేశాలిచ్చారు. అయితే, అధికారులు పబ్లిక్ టాయిలెట్లను ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేయడం, పర్యవేక్షణ లేకపోవడంతో నిరుపయోగం మారి ప్రజాధనం వృథా అయ్యిందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవయాదవ్ అన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు అందజేసిన డాక్టర్ పెండెం కృష్ణకుమార్

మన్సూరాబాద్: నాలుగుసార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన రచయిత, సమాజ సేవకుడు డాక్టర్ పెండెం కృష్ణకుమార్ మన్సూరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, డ్రాయింగ్ పెయింటింగ్స్, మహనీయుల చిత్రపటాలు, వరల్డ్‌మ్యాప్, తెలంగాణ మ్యాప్‌లు ఉచితంగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 30 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు అందజేస్తున్నామని, ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సరిత, శ్రీనివాస్, రజిత, ఆంజనేయులు పాల్గొన్నారు.